# ఆరిక కూడు



అరిచేతంత అస్సాంను అయిదు రాష్ట్రాలుగా విభజించినపుడు అరిటాకంత ఆంధ్ర దేశాన్ని రెండుగా చీల్చితే మాత్రం మునిగిపోయేదేముంది? అని ఉన్నట్టుండి శ్రీమతి ఇందిరా గాంధి ఈ మధ్య మధ్యంతరం ఎన్నికల ప్రకటన చేసినట్లు ప్రకటించిందని వింటే గూడ అంత ఆశ్చర్యపడేవాడిని కాను! కానీ.... ఆ మాటలు నాచెవుల్లో పడ్డప్పుడు కాలు నిలదొక్కుకొని నిలబడలేక పోయాను.

ఇంటిముందు పూలతోట. చూడముచ్చటగా ఉంది. ఆ అందం- పడిన శ్రమకు చూపిన శ్రద్ధకు సాక్ష్యంగా ఉంది. అంతకంటే అందంగా ఉంది ఆవరణలో మేడ! మరొకప్పుడయితే ఆ ప్రశాంత వాతావరణం... గాలితో మేలమాడుతున్న పూ బాలలు ... పూబాలల్ని ముద్దులాడుతూ తుమ్మెదలు.... అభిషేకిస్తూ అరుణకిరణాలు- గుండె పరవశించి పోయేదేమో? కానీ ఓరగా మూసిన తలుపుసందు నుండి దూసుకొని వచ్చిన మాటలు మాత్రం నన్ను ఆశ్చర్య చకితుణ్ణి చేశాయి- అక్కడ కుక్కలు  ఘూర్కాలు లేక పోయినా !

నా ఆందోళన పొంగుమీద వాళ్ల సంభాషణ చారెడు మంచినీళ్లు చల్లినట్లనిపిస్తే అడుగు అటూ ఇటు కదలలేదు. ఏ అఘాయిత్యం జరిగిపోతుందో? ఏమో? అని క్షణం క్షణం తల్లడిల్లిన మనస్సును వాళ్లనవ్వులు వెక్కిరిస్తున్నాయి. ఆశ్చర్యం నన్ను అధీనంలోకి తీసుకొని కదలనివ్వలేదు. కానీ మనస్సు మాత్రం ముందుకా? వెనక్కా? అని ఊగిసలాడుతూ ఉంది. అయితే ఆ పరిస్థితిలో వాళ్లకంట పడడం నాకే సిగ్గనిపించింది. అందుకే వెనక్కు తిరిగాను. తిరిగి చూడకుండా నడుస్తున్నాను. నడుస్తూ ఆలోచిస్తున్నాను ఆలోచిస్తూ అడ్డమైనవాళ్ళ మీద పడినట్లు పడి తప్పుకొంటున్నాను. 'ఏం తాగావా?' అన్నమాటలకు బదులు చెప్పలేక తలవంచుకొని నడుస్తున్నాను. 'మనిషి చాలమట్టుకు, డబ్బును కాలాన్ని చాల జాగ్రత్తగా వాడుకొంటాడు' అని ఋజువు పరచడానికి ఆ స్థితిలో కూడా 'రైలు సౌకర్యమా? మోటారుమేలా? ఏది ముందు వెడుతుంది? ఎందులో పదిపైసలు తక్కువ?' అని తర్జన భర్జన పడుతున్నాను. ఎవరిని అడగాలో తోచక అటూయిటు చూస్తే బాట పక్కన మసాలావడలు అమ్ముకొనే ఒక ముసల్ది కంటపడింది. అడిగితే 'వచ్చొచ్చి నన్నే అడగతా ఉండావా నాయినా! వడలమ్ముకునే ముసిల్దాన్ని. అయినా చెప్తాయిను. బస్సు చార్జీలు కరువో కాలమో అని ఇపరీతంగా పెంచేసినారు. ఇంక మనరోడ్లకత చెప్పాల్నా? ఒళ్లు గుల్లకాకుండా కొంపచేరుకోవాలంటే రైలేమేలు!' అని చెప్పింది.

కమ్మని మసాలా వడలాంటి కమ్మని మాట!

ముసలామె లోకానుభవాన్ని మసాలవడలా నంజుకొంటూ రైల్వేస్టేషన్ చేరాను. రైలు సిద్ధంగా ఉంది. నా కోసమే వేచి ఉన్నట్లుంది. పై చిల్లర డబ్బుగతి పరమాత్మ దెరుగునని టికెట్టు చేతి కందడమే చాలన్నట్లు ఒక్క అడుగులో బండిలో పడ్డాను.

బండి బయలుదేరింది. ప్లాట్ ఫారం మీద అయిదు నిమిషాల అందమైన జాతర జరిపి ఆ అయిదు నిముషాల జాతరలో కొందరిని నవ్వించి మరికొందరిని ఏడిపించి సుఖదుఃఖాలకు లౌకికలంపటాలకు అతీతుడైన వేదాంతిలా గట్టిగా నిట్టూర్చి రైలు బయలుదేరింది.

ప్రజాస్వామ్యానికి ప్రతీకగా కనిపిస్తున్న ఆ మూడవతరగతి రైలు పెట్టె ఒకచిన్న లోకం. ఆ లోకంలో అర్థంకాని రంపు. ఎవడో తెచ్చిపెట్టిన ఎండుచేపల గంప కంపు... భిక్షం పేరుతో ఖూనీ అవుతున్న సంగీతం- దేన్నీ పట్టించుకోనట్లుగా పరుగులుతీస్తూ ఉంది రైలు. అందమైన ఆ ఇంటిముందు నిలబడిన రెండు నిముషాల్లో చెవుల్లో పడిన మాటలు మాత్రం తీపులు దీస్తున్నాయి!...

"ఛీ ఛీ! ఎంత బుద్ధి హీనంగా ప్రవర్తించావు లక్ష్మీ!... ఆ ఉత్తరాన్ని చూసి వాడెంత కంగారుపడిపోయాడో?... ఏమోపాపం! ఏమంత కొంపలు మునిగిపోయాయని అలారాశావ్? అయ్యో పాపం!... ఈ పాటికి వాడు కన్నతిప్పలు పడి వస్తుంటాడు."

"రావడ మేమిటి? వచ్చి వాకిట నిలబడి ఆ మాటలు వింటున్న సంగతి వాళ్ళకు తెలియదు."

"వస్తే రానీయండి చెప్తాను. నేనేగాదు- నాలాంటి ఆడది ఎవరైనా సరే! చిటికెడు విషం- కండ్లుమూసుకొని మింగి గుటుక్కుమంటుంది కానీ, ఇది సహిస్తుందేమో అడిగి చూస్తాను?"

"ఇంతకూ నేనేం చేశానని?"

"అబ్బ! పోనీలెద్దూ!! ఇంకా ఆ పాడు మాట లెందుకు? అదొక పీడకల. వదిలి పెట్టండి."

"ఆ వేశంతో కూడిన ఆలోచనలకు, ఆలోచనలతో కూడిన ఆ వేశానికి సామ్యం చూద్దామని!"

"మీ కవిత్వానికి సమాధానం చెప్పలేను కానీ పదిరోజులు నేను ఇంట్లో లేకపోయేసరికి పనిమనిషి కాటుక డబ్బా, కుంకుమ బరిణె, చేతి రుమాలు ఇంట్లో కనిపిస్తాయా? అది వంటమనిషో ఇంటిమనిషో అర్థం కాక నా ఒళ్ళు కంపర మెత్తింది. ఆ ఆవేశంలో నేనేం చేశానో నాకే తెలియదు. ఒక ఉత్తరం గీకి పారేశాను. ఇంతకూ నిజం తెలియకుండా ఉంటేనా?"

"ఉంటే ఏం చేసేదానివో?"

"బోడి ఆడది ఏం జేస్తుందండీ! చచ్చి ఊరుకుంటుంది."

"ఆఁ! అలాగా !!"...

ఆ పై కిల కిలా నవ్వులు చిలకా గోరువంకలు సిగ్గుపడేటట్లు!

రైలు పోతూనే ఉంది. ఆ మాటలు, నవ్వులు కలిసి నా చెవుల్లో ప్రతిధ్వనిస్తున్నాయి. ఆలోచనలు రైలుతో పోటీ పడున్నాయి. అయితే రైలులాగ ముందుకు కాదు- వెనక్కు!...

చిట్టిబాబు, నేను, విజయలక్ష్మి ఒక తరగతిలో చదువుకొంటున్న రోజులవి. ఒక తరగతిలో చదువుకొంటున్నా ఒక తరగతికి చెందిన వాళ్ళం మాత్రం కాదు. విద్యా విషయకంగా ప్రజాస్వామ్యం సాధించిన ప్రగతి ఇది. విజయలక్ష్మిది సంపన్న కుటుంబం. సంపన్న కుటుంబములో పుట్టిన సంపెంగ ఆమె! నేను మధ్య తరగతివాడిని. చిట్టిబాబు మాత్రం కట్ట కడపటి వాడు. అయితే తరగతిలో మాత్రం మొట్టమొదటి వాడు. దరిద్రుణ్ణి దూరంగా ఉంచడం లోక సహజం. లోకంలోని దరిద్రనారాయణ సంఘానికి వెరచి ఏడుకొండలవాడే ఏడుకొండల కవతల చేరాడట! కానీ చిట్టిబాబు చుట్టూ మాత్రం చాలమంది చేరేవాళ్ళు.

ఒక నాటి ఉదయం నోట్లో పచ్చి మంచినీళ్లు కూడా పోయకముందే చిట్టిబాబు ఓ ప్రకటన చేశాడు. ఆ ప్రకటనతో నేను ఏడవాలో నవ్వాలో నాకే తెలియలేదు. చేష్టలుడిగి చిట్టిబాబును తదేకంగా చూస్తూ నిలబడిపోయాను. చిట్టిబాబు!... ఓ పూట అంత తిండి మరో పూట కాసిని మంచినీళ్ళ ఫలహారంతో పూట గడిపే చిట్టిబాబు... ఉన్న రెండే రెండు జతల బట్టలను రాత్రిపూట... మార్చి మార్చి ఉదుక్కొని చెంబు ఇస్త్రీ చేయడానికి చెంబు కోసం పక్కింటి పిల్లవానితో స్నేహాన్ని పెంచుకొన్న చిట్టిబాబు... కాలేజీ ఆవరణలో వంచిన తలను పై కెత్తకుండా నడుస్తూ... గది వదలకుండా పుస్తకాల పురుగై మార్కులు పోగుచేసుకొంటూ... 'అబ్బ! ఎంత బుద్ధిమంతుడ'ని పేరు దెచ్చుకొన్న చిట్టిబాబు... ప్రేమిస్తున్నాడట!... నక్క ఊళేసింది. నాకలోకం ఊహాపథంలో మెదిలింది. మహాగజేంద్రం మార్గమ్మున హుందాగా నడిచింది. దోమ కనులముందు గిరికీలు కొట్టింది. భేదం కొట్టొచ్చినట్లు కనిపించింది. అందుకే అడిగాను-

"నీవు చేస్తున్న పని ఏమిటో నీకు తెలుసా?" అని.

"నే నామెను ప్రేమిస్తున్నాను. అంతే!" అన్నాడు చాల తేలిగ్గా. నాకు కడుపుబ్బ నవ్వుకాదు– అరికాలి మంట నెత్తికెక్కింది. అసూయతో మాత్రం కాదు. వీడి బతుకంతా ఆమె చెప్పులకైనా సరిపోతుందా? అన్న సందేహంతో.

"అది సరే బాబూ! ప్రేమించడం చాల తేలిక. ఈ కాలంలో అది గురువు లేని విద్య కూడా. ఎందుకంటే రాస్తున్న నవలలు, తీస్తున్న సినిమాలు– ప్రేమ పాఠాల్ని నేర్పడమే పనిగా పెట్టుకున్నాయి గనుక. పోనీ! ఆమె నిన్ను ప్రేమించిందా?" అని అడిగాను.

"ఆమె ప్రేమిస్తే నాకేం? ప్రేమించకపోతే నాకేం? నేను ప్రేమిస్తున్నాను. అది నా కొక తృప్తి!"– అంటూ అదోరకంగా చూశాడు నా కొత్త బోడిగుండును. ఆ ముందు ముందు రోజే నేను వేంకటేశ్వరుని సన్నిధానంలో తలనీలాలు తీయించుకొన్నాను.

"కాలేజీ గోడల్లో నీడ చూసుకొంటూ దినానికి నాలుగుసార్లు నాణెంగా దువ్వుకొంటూ ఉంటివే నీ ముద్దు ముద్దుల క్రాపును. ఈ నాడు శుభ్రంగా కొట్టిపారేశావ్! పోనీ! నీవు అంత భక్తితో పూజించిన దేవుడు నీతో మాట్లాడాడా? కోరిన వరాలిచ్చాడా? మరెందుకు అలా చేశావంటే– అది నీ నమ్మకం?" అని గుచ్చి గుచ్చి అడిగినట్లుంది ఆ చూపుల్లో భావం.

అందుకే మాట మార్చాను.

"ఏకపక్ష ప్రభుత్వమైతే కత్తి కెదురుండదు కానీ ఇది ప్రేమకద నాయనా? దీనివలన ఎవరికేం లాభముంటుంది?"

"ఎందుకుండదు? ఆమెకు నా హృదయసీమలో ఒక సింహాసనాన్ని పదిలపరచు కొంటాను. చక్కని విరహగీతికలు రాసుకొంటాను. కమ్మగాపాడుకొంటాను. నా ఆనందంనాది!" ఆనంద లహరిలో తేలిపోతూ అన్నాడు చిట్టిబాబు.

చిట్టిబాబు అద్భుతంగా కాకపోయినా ఓ మోస్తరుగా పాడతాడని తెలుసు, కానీ విరహగీతికలు రాస్తాడని మాత్రం తెలియదు.

"అయితే వాగ్గేయకారుడవై పోయావన్న మాట!" ఎకసక్కెమాడింది వ్యంగ్యం.

చిట్టిబాబుకు కోపం వచ్చింది. కొరకొర చూశాడు నన్ను మింగేసేటట్టు!

"మీరంతా అనుకొంటూ ఉంటారు– రచయితలంటే దైవాంశ సంభూతులనీ, పూర్వజన్మ సంస్కారం కలవాళ్ళనీ!– దైవాంశము లేదు. గాడిదగుడ్డు లేదు. అనుభూతితో ఆలోచన... ఆలోచనతో భావావేశం... భావనానికి అందమైన భాష పేరే కవిత్వం!"

"అలాగా!... నాకు తెలియదే?... కాస్త చూపించు తండ్రీ నీ అనుభూతి ఎంత పని చేయించిందో చూద్దాం!..." అని అడిగాను.

పండ్లూడిన వాడి దవడలా పదహారు సొట్టలు తిరిగిన తనపాత పెట్టెను తెరిచాడు చిట్టిబాబు. అందులో నుండి అంతకంటే పాతదైన ఓ నోటుబుక్కును బయటికి తీశాడు. మాసిన పుస్తకంలో

కాగితాలు బాగా నలిగి ఉన్నాయి. జాగ్రత్తగా పేజీలు తిప్పుతూ ఒక చోట ఆగి ఒక సారి నా మొగాన్ని మరోసారి ఆ పేజీని రెప్పార్చకుండా చూసి ఆ పుస్తకం నా చేతిలో పెట్టాడు. చూశాను. చూడడమేం ఖర్మ? ఈ కడనుండి ఆ కడదాకా జాగ్రత్తగా చూపు మరల్చకుండా చదివాను. భావం భాష ఒక దానితో ఒకటి పోటీపడుతూ సాగింది కవిత్వం. ఆత్మానందం కోసం కవిత అనుకొంటే అది అందులో ఉంది. ఆనందం ఆశ్చర్యంగా మారితే చిట్టిబాబును అభినందించ కుండా ఉండలేక పోయాను!

అప్పటికే నేను ఒకటో అర కథలు రాస్తున్న అలవాటు కల వాడిని. కాబట్టి అందరితో చనువుగా తిరిగేవాడిని. ఒకనాడు విజయలక్ష్మితో మాట్లడుతూ ఉంటే ఆమె అడిగింది "ఏం వండీ! మీరు కథలేనా రాయడం! పాటలేమీ రాయరా?" అని. ఆ మాటతో చిట్టిబాబు మనసులో మెదిలాడు. అతని ప్రేమ వ్యవహారం మనసును గిలిగింతలు పెట్టింది. ఆ పై అతని ప్రణయ కవిత్వం తలపును తాకింది. నాకు తెలియకనే చిరునవ్వు నా పెదవుల్ని పరామర్శించింది. నా నవ్వును అంగీకారంగా తీసుకొని ఆమె ఒక పాట వినిపించమని పట్టుపట్టింది. పాట పాడాను. ప్రేమలోపడ్డ చిట్టి బాబు పాట పాడాను.

"అరె! మీరు పాటలు కూడ బాగా రాస్తారే!" ఆశ్చర్యాన్ని వెలిబుచ్చింది విజయలక్ష్మి.

"ఇది నా పాటకాదండీ! చిట్టిబాబు పాట!"

"నిజంగానా? చిట్టిబాబు పాటలు కూడ రాస్తాడా?"

"రాయడమే గాదు చక్కగా పాడతాడు కూడా!"

"ఏదో పుస్తకాల పురుగనుకున్నాను. నిజంగా నాకు తెలియదే!"

కను రెప్పలు అలా అలా అల్లార్చి ముద్దు ముద్దుగా పలికింది లక్ష్మి.

"మీకు తెలియనివి ఇంకా! చాలా ఉన్నాయి"– ధీమాగా అన్నాను– చిట్టిబాబు సాక్షాత్ ఈ విజయలక్ష్మిని ప్రేమించడం దృష్టిలో ఉంచుకొని.

"అయితే అతనిని మన ఇంటికి ఒకసారి తీసుకరారాదూ!"

"ఒక సారేం ఖర్మ? మీ రనుకుంటే వందసార్లు వస్తాడు."

నిజంగానే వందసార్లు కాదు పదివందలసార్లు వెళ్ళి ఉంటాడు– చిట్టిబాబు విజయలక్ష్మి ఇంటికి. ఆ పదివందల సార్లలో వంద ప్రణయగీతాలు రాశాడు. ఆ వంద గీతాలకు విజయలక్ష్మి ప్రతి గేయానికి ఓ బొమ్మ గీయించింది. అందంగా అచ్చువేయించింది. ఆ బొమ్మల్లో, ఆడ బొమ్మ తనది మగబొమ్మ చిట్టిబాబుదిగా ఊహించుకొనింది. ఆ పై ఊహలకు ఊపిరి పోసి చిట్టిబాబును అమాంతంగా ప్రేమించింది. పెద్దలు కాదంటే కాదన్నారు. ఆమె అవునంటే అవుననింది. ఒక్కగా నొక్క కూతురి ముచ్చట కాదనలేక పెద్దలు తలలు వాల్చేసరికి ఆమె కూడ తల వాల్చింది సిగ్గు బరువుతో! కాలం ఘనీభవించిందని కలవరపడ్తూ ఆ క్షణం కోసరమే ఎదురుచూస్తున్న చిట్టిబాబు గట్టిగా మూడు ముళ్ళు వేశాడు. ఇంచు మించు ఆ పెళ్ళికి పెద్దను నేను!

ఆ పై చిట్టిబాబు– అసలే బుద్ధిమంతుడైన చిట్టిబాబు బంగారుకు వాసవ అబ్బినట్లయితే, బంగారు బాబయ్యాడు. బాగా చదివాడు. మామగారి సాయంతో బంగారంలాంటి ఉద్యోగాన్నే సంపాదించాడు. కలలుగన్న జీవితాన్ని కమ్మగా అనుభవిస్తున్నాడు. నేను నమ్మకమైన 'ఎన్జీవో' జీవితాన్ని అతి శ్రద్ధగా లాగడంలో గాను గెద్దుతో పోటీపడ్తున్నాను సృష్టి చిత్రమేమోమరి! కొందరి జీవితాలు ఓ గూటానికి కట్టుబడ్డ గొడ్డుల్లా ఆ గూటం చుట్టూ గిరికీలు కొడుతూనే ఉంటాయి. కొందరి జీవితాలు నిత్యనూతనంగా విచ్చి వికసిస్తూంటే– కొందరి జీవితాలు అలానే మోడువారి పోతున్నాయి. సమతా సాధనకు కవులు రచయితలు రాజకీయ నాయకులు ఎవరి గొప్పలు వాళ్ళు పోతున్నారు. మిగిలింది మాత్రం ఎవరి తిప్పలు వాళ్ళకే!

చదువు మమ్మల్ని ఒక చోట చేరిస్తే జీవితం మమ్మల్ని మూల కొకర్నిగా విసిరి పారేసింది.. దాని లక్షణమే అంత!– అయితే మాత్రం విజయలక్ష్మి చిట్టిబాబులు నన్ను మరిచిపోలేదు. వాళ్ళ అనుబంధానికి కారణం నేనేనని వాళ్ళ భ్రమ. పెండిండ్లు ఈ లోకంలో నిర్ణయం కాదని నా నమ్మకం. వాళ్లజీవితాలు ముడిపడడానికి కారణం నేనే అని వాళ్ళ నమ్మకం, వారానికో నిడుపాటి ఉత్తరం రాయడం తప్పనిసరి.

విజయలక్ష్మి ఉత్తరం రాస్తుంది. ఆమె ఎప్పుడు రాసినా కవరే రాస్తుంది. అది కూడా ఎడమపక్క చక్కని ఖాళీ స్థలాన్ని వదిలి ముద్దు పెట్టుకొందామన్నంత ముచ్చటగా రాస్తుంది. తీరా ఉత్తరం పూర్తి చేసేటప్పటికి అది అటు తిరిగి ఇటు తిరిగి సూచనలు షరాలతో నిండి అయ్యో! యిక కాస్త జాగా మిగిలిఉంటే!' అన్న కొదవను మిగిల్చి పూర్తి అవుతుంది. ఆ ఉత్తరం నా టేబులు మీద కనబడ్డప్పుడు ఆ రోజంతా గుండెల్లో సందడి సందడే! ఆ రోజు ప్రభుత్వం ఇస్తున్న జీతం దండగే!

అలాంటి విజయలక్ష్మి కార్డు రాసింది. ఒకే ఒక్క వాక్యంతో కార్డు రాసింది. "రాజూ! నువ్వు రెక్కలు గట్టుకొని ఇక్కడ వాలకపోతే నా జీవితమేమవుతుందో నాకే తెలియదు!" అన్న ఒకే వాక్యంతో కార్డు పూర్తి చేసింది. రెక్కలు గట్టుకొని కాకపోయినా ముప్పు తిప్పలుపడి మా మేనేజరు మిడిగుడ్లు మూతి విరుపులు మెడవిరుపులు కిక్కురుమనకుండా భరించి మూడు రోజులు సెలవు సంపాదించి పుట్టి మునిగినట్టు పరుగెత్తి ఇంట్లో అడుగు పెడ్తే అడుగు ముందుకు కదలలేదు. నిలబడి విన్నాను. నవ్వాలో ఎడవాలో తెలియలేదు. వాళ్ళ మాటల్తో తేలిన సారాంశం ఏమంటే?– అమ్మగారు పదిరోజులు ఊళ్ళో లేక పోయారట! అయ్యగారు ఇంట్లో ఒంటరివాడేనట! ఒంటరి అయ్యగారికి తోడు వంటమనిషి. ఆ వంటమనిషి కాటుక డబ్బా, కుంకుమబరిణె, చేతి రుమాలు ఇంట్లో అమ్మగారు అడుగుపెట్టే సరికి కనిపించాయట. కంపర మెత్తి కాలుగిరి ఖణిల్లని రంకె వేసిందట– గోమాత లాంటి భారత నారి! మగధీరుడు మాత్రం సామాన్యుడా? వాడు కూడా సై అంటే సై అని ఉంటాడు. అదృష్టవశాత్తు ఎలాగో నిజం తెలిసింది. చెలరేగిన స్పర్థ వ్యర్థమయింది. ఆ నిజం ఎలా తెలిసిందో తెలుసుకొనే అవకాశం నాకు లేకపోయింది. దాంతో నిమిత్తం కూడా నాకు లేదు. వాళ్ళ జీవన స్రవంతి సాఫీగా సాగిపోవడమే నే నెప్పుడూ కోరుకొనేది.

వాళ్ళ అన్యోన్య దాంపత్యం,.... కలిగిన చిన్న అంతరాయం....అంత చిన్న సంగతి ముందు వాళ్ళు ఏళ్ళ తరబడిగ సాధించిన పరస్పరావగాహన వీగిపోవడం... అనవసరంగా రేగిపోవడం..... అంతా చిత్రంగా కనుపిస్తూంటే ఆలోచిస్తూ కూర్చున్నాను. రైలు కొన్ని స్టేషన్‌లలో ఆగుతూ కొన్నిటిని దాటుతూ ప్రయాణం సాగుతూనే ఉంది.

“ఏఁవిటిది?” రైలు శబ్దాన్ని మించిన గద్దింపు చెవిని పడింది.

ఆలోచన్ని అర్ధాంతరంగా అటక కెక్కించి చూద్దును గదా! ఎదురు సీట్లో ..... ఒకావిడ! ఎడమచేత్తో సగం తెరిచిన పెట్టెను పట్టుకొనింది. కుడిచోతిలో ఓ కొత్తచీర ఉంది. సగం తెరిచిన పెట్టెనుండి చల్లగ సంగ్రహించిన బిస్కట్ పొట్లంతో ఇద్దరు పిల్లలు రాజీ పడుతున్నారు. ఆమె, ఆమె భర్తలాంటి మగవాడు చీరతో పోటీ పడుతున్నాడు.

“ఎందుకండీ అట్లా గుడ్లు మిటకరిస్తారే? వినిపించలా.... అడుగుతున్నది మిమ్మల్నే!”

“చెల్లాయికీ........” నీళ్ళు నములుతున్నాడతడు.

“సంతోషించాం! ప్రియురాలి కనలేక పోయారు? మారు కట్టుకోవడానికి చీరలేక మగ్గిపోతున్నా! ఒక చీర పేలిక కోసం వందసార్లు మొత్తుకొన్నా చెవిని పడలేదు. ఆ పిల్ల వాళ్ళని చూడండి. కొడుకులని చెప్పుకోవడానికే సిగ్గేస్తుంది. అయినా చెల్లాయట! చెల్లాయ్!!...... హుఁ! ఇంతకూ ఒకరినని ఏం ప్రయోజనం? నా రాత సరిగ్గా రాసి ఏడ్చివుంటే నేనీ ఏడుపులు ఏడవాల్సి వచ్చేదిగాదు!”

ఆమె అది రైలు పెట్టె అని అన్నసంగతి మరిచిపోయింది. తమ చుట్టూ తమ సంగతి మరిచి చెవులు రిక్కించే మానవజాతి ఉందని గ్రహించ లేకపోయింది. తన ధోరణి తనదిగా ఉంది. అంతవరకు నిందితుడై ఆమె వైపే తదేకంగా చూస్తూ ఉండిన మగధీరుని చూపులు అటు యిటూ మళ్ళాయి. కొందరు ఆశ్చర్యంగా చూస్తున్నారు. సన్నగా కొందరు కళ్ళతో మరి కొందరు బిగ్గరగా పళ్ళతో నవ్వుతున్నారు. అరికాలికింద రైలు చక్రాల్లో మంట ఆ మగరాయుడి నెత్తికెక్కింది.

“ఆ బ్రహ్మగాడికి బుద్ధిలేక రాస్తే రాశాడు గానీ, వాడికి బుద్ధిలేదని గ్రహించిన నీ బుద్ధిమాత్రం చాల గొప్పది. నాతో ఇలావుండి నువ్వేడుస్తూ నన్నేడిపించడమెందుకూ? నవ్వుతూ నవ్విస్తూ ఎక్కడ హాయిగా ఉంటావో అక్కడికే వెళ్ళిపోరాదూ! ఒక్కనాటితో పీడ విరగడవుతుంది!”

“ఆఁ! అలాగా!!...... ఆ పైన ఎవతెనో దారిన పోయ్యే దానిని తెచ్చి పెట్టుకొని కులకదామనా?.... ఛీ ఛీ ! సిగ్గు లేకపోతే సరి!..... ” అంటూ ఆమె చూపులు మరల్చింది. అప్పటికది రైలు పెట్టె అని గ్రహించి నట్లుంది. ముఖం క్షణ క్షణానికి రంగులు మారింది. కండ్లు నిండుకొన్నాయి. అభిమానం చూపిన పెగ్గె అది!

“రండి! మీ చేతులతోనే గబుక్కున కింద తోసేయండి. పడి చస్తాను. మీ రన్నట్లు ఒక్క నాటితో పీడ విరగడైపోతుంది.!”

ఆమె అతని చేతిని పట్టి లాగుతూ ఉంది. పెనుగులాటలో పైట జారింది. తలలో పువ్వులు జారాయి. రైలు పెట్టెలో నవ్వులు చెలరేగాయి. ఏదీ గమనించని స్థితిలో ఆమె వెక్కి వెక్కి ఏడుస్తూ ఉంది. ఇద్దరు పిల్లలు బిస్కట్ పొట్లాన్ని వదిలిపెట్టి తల్లిని చుట్టుకొన్నారు. కసుగందుల ఏడ్పులు ఈ కమ్మని దృశ్యానికి రంగులు పులుముతున్నాయి "చేయి వదల్తావా? లేదా?"– అంటూ చేయి పై కెత్తుతున్నాడు తాళి గట్టిన ధీరుడు.

"ఛీ ఛీ! మీ కేమన్నా బద్ధుందా లేదా? ఇన్నేండ్లు సంసారం చేసి ఇద్దరు బిడ్డల్ని కనుక్కొని ఇంకా కుక్కల్లాగా కాట్లాడుతున్నారే?.... తోడ బుట్టుకు ఒక చీరతీసిస్తే నీ యబ్బ గంటేఁవి పొయ్యిందమ్మీ. మీ అన్న నీ కొక చీరతెస్తే మీ వదిన వాడినలా అడిగితే నువ్వేమంటావు?... పోనీ! ఆడది అడిగితే అడిగింది... దాని బుద్ధే అంత .... దానికి చెయ్యి చేసుకుంటావా?... చాలు చాలుగాని కూర్చోండి." జీవితానుభవంతో పండిన ఓ నిండు ముత్తైదు చొరవచేసుకొని ఇద్దరినీ గదమాయించింది. నాలాంటి ఒకరిద్దరు ఆశ్చర్యంగా ఆమెవైపు చూస్తే "ఏఁవుందిలే నాయనా! ఆలుమగల కొట్లాట ఆరిక కూడు ఉడికే దాక!" అంటూ ముసిముసిగా తనలోతాను నవ్వుకొనింది. అంత తేలికగా ఆమె సమాధాన పడ గలిగింది కానీ, నా సందేహం నాది. ఆ దృశ్యం నా మనస్సును పిండితే ఇక జన్మలో వాళ్ళు ఒకరి మొగం ఒకరు చూచుకోలేరన్న సందేహం ఈ దేహంలో జొరబడింది. ఈ సందేహాన్ని పక్కకు నెట్టుతూ విజయలక్ష్మి చిట్టిబాబు! మనసు గందరగోళంగా ఉంది. రైలు పరుగెడుతూనే ఉంది. చూపులు ఈ సమస్యాపూరణకై శూన్యంలో దేవులాడుతున్నాయి.

ఎంత సేపు గడిచిందో తెలియదు. చీకటి తెరల స్వైర విహారం ప్రారంభమయింది. రైలు ఓ స్టేషనులో ఆగింది. విద్యుత్కాంతులతో 'ప్లాట్‌ఫారం' వింత కాంతులీనుతూ ఉంది. ఇంతవరకు కీచులాడు కొంటున్న ఆలుమగలు ఆ స్టేషనులో దిగడానికి సామానులు సర్దుకొంటున్నారు. ప్లాట్‌ఫారం బాగా రద్దీగా ఉంది. ఎక్కేవాళ్ళు, దిగేవాళ్ళు తోచులాట చెడుగుడు ఆటలా ఉంది. కాలూ చెయ్యిమీద కలవరమున్నట్లు కనిపించలేదు. ఎక్కేవాళ్ళు దిగేవాళ్ళకు, దిగేవాళ్ళు ఎక్కే వాళ్ళకు నిదానాన్ని గురించి పాఠాలు చెప్పే ప్రయత్నంలో ఎవడిపాఠం వాడిదిగా ఉంది. చెబుతున్న పాఠాలను పెడచెవిని పెడుతున్న నేటి విద్యార్థిలా ఆ తోచులాటతో ఇరుక్కున్నాడు, ఇంతవరకు భార్యతో యుద్ధానికి తలపడిన మగధీరుడు. మనిషి గోగుదంటులా సన్నగా ఉన్నాడు. ఆయాసపడుతూ ఆదోరకంగా దగ్గుతున్నాడు. దగ్గుతూ దిగలేక నలిగిపోతున్నాడు. అది గమనించిన అర్ధాంగి మధనపడిపోతూ ఉంది. "అబ్బబ్బ! ఏం పాడుగుంపో? ఒక రీతి లేదు. రివాజులేదు. వీళ్ళకంటే గొర్రెలగుంపు మేలు!" అని వాపోతూ ఉంది. "నిదానంగా ఎక్కి దిగితే మీ అబ్బగంటేం పోతుంది?" అని అందరినీ మందలిస్తూ జాగ్రత్తగ దిగమని భర్తను హెచ్చరిస్తూ ఉంది.

అతడు దిగాడు. ఆమె చెప్పినట్లు జాగ్రత్తగానే దిగాడు. ఆ మీదట ఇద్దరు పిల్లల్ని దించుకొన్నాడు. ఆమె చేతిని పట్టుకొని మెల్లగా దిగమంటున్నాడు. ఎవరి తొందరలో వాళ్ళుంటే– "ఆడ మనిషి దిగటం తెలియడంలేదా?" అని అందరిపైన గుడ్లురుముతున్నాడు. ప్లాట్‌ఫారం కాస్త ఎత్తుగా కట్టిన వాళ్ళని నిందిస్తున్నాడు. నా ఆశ్చర్యం గుడ్లప్పగించి చూస్తూ ఉంది. గంటకు

ముందు, ఈ పెద్దమనిషి, 'ఫో! ఎవడితో నీ కిష్టమయితే వాడితో పో! పీడ విరగడవుతుంది!' అని పదిమంది ముందర పబ్లిక్‌గా చాటింపు చేసిన పెద్దమనిషి పడుతున్న ఇబ్బందికి అర్థం తెలియలేదు. రైలుపెట్టెలో స్వజాతి నవ్వులు గసపోసు కొంటున్నాయి.

అంతలో ఎవ్వరో ఓ పల్లెటూరి అబ్బాయి. ముద్దుగ ఉన్నాడు. 'అసలు సిసలైన తెలుగుజాతికి వారసుడిని నేను!' అన్నట్లున్నాయి అతని దుస్తులు. పండ్లసందున టిక్కెట్టు కరిచి పట్టుకొన్నాడు. చేతిలో పాత సంచి... మరోచేత్తో ఊడిపోతున్న గోచి... రైలు వెళ్ళిపోతుందేమో అన్న తొందర్లో ఏదీ గమనించే స్థితిలోలేడు. చెయ్యి ఆ హడావిడిలో దిగుతున్న సాధ్వీమణికి తగిలింది. మగధీరుడు రెచ్చిపోయాడు.

"కండ్లు కనపడలా?.... ఆడవాళ్ళు దిగుతున్నారన్న ఇంగితజ్ఞానం కూడా లేదు. ఛీఛీ! వట్టిఫూల్స్!"

"పొరపాటయిపొయిందయ్యా! రైలెల్లిపోతుందేమో అని తొందరపడ్డి! ఏఁవనుకో బాకండయ్యా!" తప్పు తెలుసుకున్నాడు పల్లెటూరబ్బాయి. వాడి మాటల్లో తపన ఉంది.

"రైలెక్కడికిరా పొయ్యేది?... సుద్ద పల్లెటూరి గొర్రెలా మాట్లాడు తున్నావే?"

"నేను గొర్రెకాదయ్యో! పొట్టేలు!..."

"ఆc!"

"మరేందయ్యా? నీ ఇష్టమొచ్చినట్టు నోరుపారేసుకుంటా ఉండావే? చేసిన తప్పు ఒప్పుకుణ్ణోడు గొర్రెట్టవతాడు. పొరపాటయిందని సెప్పినా తెల్సుకోలేని నువ్వు గొర్రె! నీ యబ్బ గొర్రె! నీ తాత గొర్రె !!"

రైలుపెట్టె విరగబడి నవ్వింది.

"ఎవరితోనో నవ్వుతూ నవ్విస్తూ హాయిగా ఉండు! ఫో!!" అని గంటక్రితం ధారాళంగా పర్మిషన్ ఇచ్చిన పెద్దమనిషి పొరపాటుగ పరపురుషుని చేయి తగలడాన్ని కూడా సహించలేక పోవడం నా మెదడులో ఒక అందమైన అలజడిని రేపింది.

గార్డుచేతిలో పచ్చదీపం తలమీద మూరెడు పైకిలేచి శోభాయమానంగా వెలుగుతున్న విద్యుద్దీపాలను 'చూడు నా దెబ్బ!' అని సవాలు చేసినట్లు అటూ యిటు ఊగే సరికి రైలు బయలుదేరింది. కొన్ని ఆలోచనల్ని, అనుభూతుల్ని వదిలిపెట్టి మరికొన్ని కొత్త ఆలోచనల్ని, ఆవేదనల్ని మోసుకొని రైలు బయలుదేరింది.

విజయలక్ష్మి చిట్టిబాబుల సంసారం కండ్లముందు కదిలింది.

రైలు పెట్టెలో కీచులాట కిచకిచ నవ్వింది.

ఈ అనుభవానికి ఓ అందమైన రూపం ఇవ్వడానికి ఆలోచన రైలు వేగాన్ని అందుకోవడానికి ప్రయత్నించింది. ఆ వేగంలో విజయలక్ష్మి చిట్టిబాబుల వాదులాట... రైల్లో కీచులాట మార్చి మార్చి దృశ్య మానమై మనస్సును మథనపెడుతుంటే–

'రైలు ఒక సంసారము. రైల్వేస్టేషన్లు ఆలుమగలమధ్య జగడాలు!... రైలు గమ్యస్థానం చేరుతుంది. ఆలుమగలనబడే రెండు పట్టాలమీద సంసారమనబడే రైలు.... జగడాలనే స్టేషన్లలో ఆగుతూ ఆగుతూ గమ్యస్థానం చేరుతుంది.'

అనుభవం నేర్పిన పాఠం ఇది! నాలో నేను నవ్వుకొన్నాను. నవ్వుతూ ఆ పండు ముత్తైదును చూశాను. ఆమెకూడా నవ్వుతూ ఉంది. అది నవ్వుగాదు. ఆ తల్లి జీవితానుభవాల తోరణంలో అరవిరిపిన పువ్వు! 'నాయనా! ఆలూమగల కొట్లాటెంతసేపు? ఆరిక కూడు ఉడికే దాక!' అన్నట్లుందా నవ్వు!

అవును! సంసారం ఒక ఆగనిరైలే గమ్యం చేరేదాకా! ●

భారతి
(1, సెప్టెంబర్ 1974)